'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు
- క్లస్టర్ పరిధిలో 8,739 మంది విద్యార్థులు, 50 పరీక్ష కేంద్రాలు



కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతి

కొత్తపేట/మామిడికుదురు/అంబాజీపేట: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు అవిశ్రాంతంగా చదివారు. పరీక్షలను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేశారు. దానిలో భాగంగా గత 6 నెలల నుంచే విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ఉత్తమ విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించేలా, చదువులో వెనుకబడిన విద్యార్థులు కనీసం సెకండ్ క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో సర్వం సిద్ధం చేశారు. మండలాల్లో విద్యాశాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడైనా ఏ చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

పాఠశాల దశ చివరలో తొలి దఫా పబ్లిక్ పరీక్షలు ఇవి. ఈ పరీక్షలు రాయడమంటే సాధారణంగా విద్యార్థుల్లో సహజంగా కొంత ఆందోళన ఉంటుంది. ఏమాత్రం ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తే తగిన సమాధానం గుర్తుకు వస్తుంది. వన్ బై వన్ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు పూర్తి చేయవచ్చని విద్యావేత్తలు సూచిస్తారు. పరీక్షల సమయంలో రోజు విడిచి రోజు పరీక్ష ఉండటంతో సబ్జెక్టును నెమరు వేసుకునేందుకు విద్యార్థులకు చక్కటి అవకాశం ఉంటున్నారు. ఈ నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ నిర్ణయించారు. 17న ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు), 19న సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), 21న ఇంగ్లిష్, 24న మ్యాథ్స్, 26న ఫిజిక్స్, 28న బయాలజీ, 31న సోషల్ పరీక్షలు జరుగుతాయని నిర్ణయించారు. అయితే క్యాలెండర్ ప్రకారం 31న రంజాన్ పర్వదినం. దీన్ని పురస్కరించుకుని 31న నిర్వహించాల్సిన సోషల్ పరీక్ష అదే రోజున నిర్వహిస్తారా? లేక ఏప్రిల్ 1న నిర్వహిస్తారా? అనే అంశంపై ఇంతవరకూ స్పష్టత లేదు. చంద్ర దర్శనాన్ని బట్టి ముస్లింలు రంజాన్ పర్వదినం జరుపుకుంటారు. రంజాన్ 31 అయితే ఏప్రిల్ 1 న పరీక్ష వాయిదా పడుతుంది. 1న రంజాన్ అయితే షెడ్యూల్ ప్రకారం 31న నిర్వహిస్తారు. ఆ మేరకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలిలా..

నియోజకవర్గం	పరీక్ష కేంద్రాలు	విద్యార్థులు
కొత్తపేట	16	3,542
పి.గన్నవరం	19	3,083
రాజోలు	15	2,114
మొత్తం	50	8,739

పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాం. మండలంలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులను అన్నివిధాలా సిద్ధం చేశాం. ఈ ఏడు పరీక్షల మధ్య ఒక్కరోజు సమయం ఉండడం పిల్లలపై ఒత్తిడి తగ్గుతుంది. ఆ సమయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి. ఈ ఏడాది కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ వారు ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా కల్పించారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి.

– ఎం.హరిప్రసాద్, ఎంఈవో, కొత్తపేట

పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత

అల్లవరం: ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు ఆధ్వర్యాన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ సంయుక్తంగా భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ఆవశ్యకతను వివరించారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంటున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నచోట స్థానికులతో కలసి ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ చీపుర్లు చేతబట్టి పారిశుధ్య చర్యలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవగుప్తంలో సర్పంచ్ సంగాడ సుభాష్ ఆధ్వర్యంలో గ్రామస్తులను ఉద్దేశిస్తూ, పాడి చెత్త నిల్వ చేసుకునేందుకు వీలుగా ప్లాస్టిక్ బుట్టల పంపిణీ జరిగింది.

అంబాజీపేట: పరిసరాల శుభ్రతగా ఉంచడం ప్రజలందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రతను శనివారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావుతో పాటు మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఉండ్రాసి నాగబాబు, పైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్ఓల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు.

పి.గన్నవరం: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముంగండలో సర్పంచ్ కుసుమ చంద్రశేఖర ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులతో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర 2కె రన్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కుసుమ వెంకటేశ్వరరావు, అంబటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ పరిసరాల కోసం కృషి చేయాలని మామిడికుదురు డీప్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డీడీవీ సత్యనారాయణ సూచించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కో–ఆర్డినేటర్లు పొన్నమంద సుబ్బారావు, వాసంశెట్టి నాగరాజు, అడబాల ఈశ్వరరావు, కడలి మురళీ శ్రీనివాస్, వీరా కొండలరావు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని తగ్గిద్దాం.. భూగోళాన్ని రక్షిద్దాం

అయినవిల్లి: కాలుష్యాన్ని తగ్గిద్దాం.. భూగోళాన్ని రక్షిద్దామని ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ముక్తేశ్వరం సెంటర్ వరకూ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను వేయవద్దని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ ఎప్పటికీ పూర్తిగా కుళ్ళిపోవట్లేదన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వేల సంవత్సరాలు పడుతుందన్నారు. దీని వల్ల భూతాపం పెరుగుతోందన్నారు. తద్వారా భూ వాతావరణంలో తేడా లేర్పడుతుందన్నారు. ప్రకృతి వినాశనకు కారణం అవుతోందన్నారు. అనంతరం ముక్తేశ్వరంలో సెంటర్ మానవహారం పాటించి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రావులపాలెం: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముంగండలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి



పెనపల్లలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు



అంబాజీపేటలో పారిశుధ్య పనులు చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహరా

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు కృషి చేయాలి

సఖినేటిపల్లి: గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించేందుకు, ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రానున్న వేసవిలో గ్రామాలలో ఎండలకు ఆరిపోయే కాలువలు, బోదెలలో పూడికతీత పనులను పంచాయతీలు చేపట్టాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డు స్థలాల విషయంపై తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుతో ఎమ్మెల్యే చర్చించారు. తొలుత శాఖల వారీగా రివ్యూను ఎంపీడీవో కె.సూర్యనారాయణ నిర్వహించారు. ప్రధానంగా విద్యాశాఖపై ఎంఈవో–1 డి.కిషోర్కుమార్ వివరిస్తున్న తరుణంలో ఎంపీపీ మల్లిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల్లో టాయిలెట్స్ సక్రమంగా లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే శరణిగ రదులో పిల్లలకు తగ్గట్టు సౌకర్యాలు ఉండడం లేదని తెలిపారు. కాగా కొబ్బరిచెట్లకు నల్లి తెగులు నివారణపై హార్టికల్చర్ అధికారి దుర్గారావు సవివరంగా వివరించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు వివరణ కోరిన నేపథ్యంలో, దుర్గారావు బదులిస్తూ కొబ్బరి తోటలలో రైతులు సామూహిక నివారణ చర్యలు చేపడితేనే ఫలితం ఉంటుందని వెల్లడించారు. అంతర్వేదికరలో ప్రధాన రహదారిపై పశువులు సంచారం లతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సర్పంచ్ పోతురాజు నరసింహారావు అధికారుల దృష్టికి తెచ్చారు. రామేశ్వరంలో వోల్టేజ్ సమస్యను ఎంపీటీసీ దొండపాటి సునీత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంఆర్ఐజీఎస్ ఏపీఈ ఎంనాగప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, పలువురు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి ప్రత్యేక తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్వర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని వేదపండిత–ద ర్శకాధారా ఆలయ కమిషనర్, దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,35,825, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.36,621తో మొత్తం రూ.1,72,446 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.



మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పీచు పరిశ్రమను తొలగించాలని ధర్నా

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలోని జీసీఎస్కు ఆనుకుని ఉన్న పీచు పరిశ్రమను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం సదరు జీసీఎస్ గేటు వద్ద తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామస్తులు ధర్నా చేశారు. గత నాలుగు రోజుల నుంచి జీసీఎస్ ద్వారా నివాసయుక్తుల లీకేజీలు, పీచు పరిశ్రమలో అగ్నిప్రమాదం ఘటన తమను కంటిమీద కునుకు లేకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా పీచు పరిశ్రమను తక్షణం తొలగించకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. నల్లి సత్యనారాయణ, గంటా చినవెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో ఆందోళన చేస్తున్న తూర్పుపాలెం, గొల్లపాలెం ప్రజలు

వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

అల్లవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు.



నర్సిపూడిలో తులసిమాలలతో అలంకారభూషితుడైన వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి నిత్యకైంకర్యాలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వామి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జస్టిస్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎస్వీ శ్రావణ్ కుమార్ కుటుంబ సమేతంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద జస్టిస్ శ్రావణ్ కుమార్కు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకుల ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, జస్టిస్కు అందజేశారు.



జస్టిస్ శ్రావణ్కుమార్కు స్వామి చిత్రపటం ఇస్తున్న సారథి

అభివృద్ధి పనులకు శ్రీకారం

అల్లవరం: మండలంలోని చింతలూరులో శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యటించారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపాన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్తో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే ఓఎన్జీసీ, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో రూ.15 లక్షలతో ధాన్యం, ఎరువులు నిల్వ చేసుకొనుటకు నిర్మించిన గోదాముకు కూడా వారి ద్వారా ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ మార్గని కరుణ, టీడీపీ రైతుల్ మెర్ల గోపాలస్వామి, వైట్ల శేషుబాబు, దండంగి మమత తదితరులు పాల్గొన్నారు.



చింతలూరులో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఉచిత ఈఎన్టీ వైద్య శిబిరం

అంబాజీపేట: చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన రోగులు సంప్రదిస్తే వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉండి వైద్యులను సంప్రదించాలని అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ ప్రకాశ్ అన్నారు. అంబాజీపేట నాగుల్లంక వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఉచిత ఈఎన్టీ వైద్య శిబిరాన్ని హెచ్ఎం పి.వి.ఎస్.ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగింది. వైద్య శిబిరంలో భాగంగా 83 మంది విద్యార్థులకు ప్రకాశ్తో పాటు మురళీకృష్ణంరాజు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

సఖినేటిపల్లి: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి విద్యార్థి సంఘాల ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రతినిధి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం టేకిశెట్టిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ఇతర పాఠశాలలలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పదో తరగతి పిల్లలకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పిల్లలకు రాజేంద్ర ప్రసాద్ సూచించారు. మలికిపురం మండలంలో పలు పాఠశాలల్లో పిల్లలకు వీటిని వారు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు తాడి రవీంద్ర ఆర్థిక సాయంతో వీటిని సమకూర్చారు.

క్లుప్తంగా

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోట మెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, మొక్కులు చెల్లించారు.



తోటమెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



రాజోలులో విద్యార్థులకు కళ్లజోళ్లు అందిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

రాజోలు: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శనివారం కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నల్లి మనోహరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. గతంలో 29 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారికి కళ్లజోళ్లు మంజూరయ్యాయి. తొలుత స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించి సింగిల్యూజ్ ప్లాస్టిక్పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణ

అల్లవరం: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారికి జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ ప్రధాన అధికారి వి.సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సుమారు రూ.2.5 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సహకారంతో అమ్మవారికి తయారు చేయించి అలంకరించిన వెండి ఆభరణాలను చూసి ఆయన మంత్రముగ్ధులయ్యారు. రామచంద్రపురం తనిఖీదారు ఎం.బాలాజీ రాంప్రసాద్, ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి, జేపీ పి.పవన్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస తులాభారం



శ్రీనివాస తులాభారం నిర్వహిస్తున్న పండితులు

రావులపాలెం: స్థానిక అలివేలు మంగ పద్మావతి ఆండాళ్ సహిత వెంకటేశ్వర స్వామి 16వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి శ్రీనివాస తులాభారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, తిరుప్పావడ సేవ నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. ఆలయ అర్చకుడు వాడపల్లి కమలనాభాచార్యులు, ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యుల బ్రహ్మత్వంలో ఈ పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ పాలకమండలి చైర్మన్ సూరా పెద వెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

మహిళలు పారిశ్రామికంగా ఎదగాలి

రావులపాలెం: మహిళలు పారిశ్రామికంగా ఎదగాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘాల మహిళలకు శ్రీనిధి ద్వారా మంజూరైన రుణాలను అందజేశారు. 356 స్వయం సహాయక సంఘాల్లో 1,921 మంది సభ్యులకు రూ.10 కోట్ల చెక్కును సమాఖ్య ప్రతినిధులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం కింద వర్లేటిని ఉన్నతి రుణాలను సభ్యులకు రూ.8 లక్షల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శ్రీనిధి ఏజీఎం ప్రసన్నకుమారి, కొత్తపేట క్లస్టర్ శ్రీనిధి మేనేజర్ కిరణ్కుమార్, ఏపీఎం అలివేలు మంగమ్మ, సీసీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

అంబాజీపేట: కంటి సమస్యలపై అశ్రద్ధ వేస్తే శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉందని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. ప్రపంచ గ్లౌకోమా వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట పీహెచ్సీ వద్ద ప్రోగ్రాం నోడల్ పర్సన్ వి.ప్రభాకర్ అధ్యక్షతన ర్యాలీని శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కంటి శుక్లాలు వచ్చినప్పుడు క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స తప్పక చేయించుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే అది గ్లౌకోమాగా మారి శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉంటున్నారు. 40 ఏళ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన కళ్లజోళ్లు ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

అల్లవరం: చింతలూరులోని నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ పి.శ్రీకర్ కోరారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ముఖ మండప ఆవరణలో శనివారం ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి అధ్యక్షత వహించగా జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ, తనిఖీదారు ఎం.బాలాజీ రాంప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, డీఎల్పీఓ ఎ.రాజు, ఆడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత, ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఎన్.రవిశంకర్, ట్రాన్స్కో ఏడీఈ సీహెచ్ శ్రీధర్, ఎక్సైజ్ సీఐ వడ్డీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఫైర్ ఇన్స్పెక్టర్ జె.హనుమంతరావు, రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ కెడిఎస్ఎస్ కుమార్ హజరయ్యారు. తొలుత తీర్థంలో పారిశుధ్య కల్పన, శాంతి భద్రతలపై ఈఓతో తన్ను చర్చలపై సర్పంచ్ మార్గని కరుణ, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ కేజీ ప్రకాష్బాబు, ఎస్సై ఎం.అశోక్, ఆడిట్యూఎస్ జేఈ పి.వర్మలను ఎమ్మెల్యే బండారు, ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు కలసికట్టుగా పనిచేసి జాతరను విజయవంతం చేయాలని అధికారులను కోరారు.

ఎంపీటీసీ సభ్యుల గైర్హాజరుతో సమావేశం వాయిదా

మలికిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు. ఈ క్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన జరగాల్సిన పై సర్వ సభ్య సమావేశానికు ప్రత్యామ్నాయంగా అదే వేదిక నుంచి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అధికారులతో సమస్యలపై సమీక్ష నిర్వహించారు. డ్వాక్రా మార్కెట్ డైరెక్టర్ జి.పెదకాపు, ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు, తహసీల్దారు టి.శ్రీనివాసరావు, సీడీపీఓ వైజయంతీ రమాదేవి, ఆలపాటి ఎంఈఓ రమేష్ బాబు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. గొల్లపాలెం గ్రామానికి చెందిన దాసం నాగ దుర్గ(33) రెండు కిడ్నీలు పాడైపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు తెలిపారు. వ్యవసాయ కూలీగా పని చేసే దుర్గ భర్త అంత ఆర్థికస్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో పేషెంట్ భర్త దాసం శ్రీనుకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా చెక్కు అందజేశారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

అల్లవరం: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట డివిజన్ ఉపసంచాల వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలం పరిధిలోని పెదపట్నం, బొండాయికోడు పీహెచ్సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం నిర్వహించిన చిన్నారులకు టీకాల ప్రక్రియను ఆమె పరిశీలించారు. వైద్యాధికారులు డి.సువర్ణలావణి, డి.సాయి కిశోర్ ఆధ్వర్యంలో అల్లవరం–2, కోడూరుపాడు, పెదపట్నం, చింతలూరు, కలపర్రు, బొండాయికోడు, మెరుగుపాలెం, మొగళ్ళమూరు, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 150 మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్ఓ ఎం.ఎస్.ఎన్.రెడ్డి, హెచ్ఈఈ ఈ.కె.జ్యోతికుమార్, హెచ్ఈఓ ఎల్.బి.సూర్యనారాయణ, ఏపీవీ రాజా అక్కుల, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పర్యవేక్షించారు.